# వదిలేసింది... సి. ఆనందారామం



అంతా అనుకున్నట్లే జరుగుతోంది!

లోకులంతా కాకుల్లా పొడుస్తునారు. పదిమందిలోకి వెళ్ళినప్పుడు పక్కనవ్వులు ఎక్కువవుతున్నాయి...

తనను చూడగానే ప్రశ్నార్థకాలూ, వాటిని అనుసరించి గుసగుసలూ కూడా ఎక్కువవుతున్నాయి...సంస్కారం పేరిట ఎందుకిలాంటి ప్రహసన ప్రదర్శన! అంతకంటె తనను నిలేసి 'నీ మొగుణ్ని ఎందుకు వదిలేసావు? ఆడది చెయ్యవలసిన పనేనా?' అని అడగకూడదూ! సమాధానం చెప్పేదిగా, 'ఆడది చెయ్యవలసిన పని అవునో, కాదో, కాని మనిషి చెయ్యకుండా ఉండలేని పని'... అని...స్త్రీలకు సహనం ఉండాలనే సూక్తి జీర్ణించుకోకపోయినా, విధికి తలవంచి సహనాన్నే వరించింది సుశీల...రెండవ పెళ్ళివాడు... నలుగురు బిడ్డలవాడు... అందగాళ్ళలో చేరనివాడు ... తనను చేసుకుంటానని అన్నప్పుడు...ఇయ్యాలని కన్న తల్లిదండ్రులు సంకల్పించుకున్నప్పుడు... మాట్లాడక ఒప్పుకుంది. ...రాజీ...రాజీ...రాజీపడాలి! బ్రతుకులో నిరంతరం చెలరేగే సంఘర్షణలతో ఎప్పుడో ఒక్కప్పుడు ఎలాగో ఒకలాగ రాజీపడక తప్పదు!...అందుకే ఉండీ లేని సంసారంలో చికాకులయితేనేం? సవతి పిల్లల ఆలనపాలనలయితేనేం? అనుకొంది.

కట్నాలు గుమ్మరించి పెళ్ళి చెయ్యలేని కుటుంబంలో మోడుగా బ్రతికితేనేం?...ఏదో ఒక మొగుడితో సర్దుకుంటేనేం?- అనుకొంది.

బంగారు కలలు కననూ లేదు—అవి పండించుకోలేకపోయానని వగవనూ లేదు.

సహనంతో సర్దుకోవటానికే ప్రయత్నించింది.

అయితే ఒక చిన్న పొరపాటు...పొరపాటు అనటానికి కూడా వీల్లేని పొరపాటు జరిగింది.

లేనిపోనివి ఆశించకపోయినా ఉన్నంతలో ఆశలు పెంచుకొంది.

భర్త ఏదో మంచి ఉద్యోగస్థుడే గనుక ఆర్థికమైన ఇబ్బందులు ఉండవనుకొంది.

తనను నలుగురూ అందగత్తెగానే అనుకుంటారు కనుక భర్త అనురాగానికి

పాత్రురాలు కాగలననుకొంది...ఇంట్లో సామానులు అయిపోయాయి-భర్తతో ఆ విషయం చెప్పింది.

"నా దగ్గిర డబ్బులేదు!" అతి మామూలుగా అన్నాడు.

"ఎలా మరి?" ఆశ్చర్యంతో ప్రశ్నించింది.

"ఏమో మరి!"

అదేదో నీ సమస్య-నాకు సంబంధించినది కాదు-అన్నట్లు మాట్లాడాడు.

"ఇవాళ ఇంకా పదోతారీఖు-అప్పుడే జీతమంతా అయిపోయిందా?"

"ఓహో! దేవిగారికి లెక్కలు చెప్పుకోవాలా? పొగరుబోతువేషాలు వేసావంటే జాగ్రత్త!...నా జీతం నాయిష్టం"

'నా జీతం నా యిష్టం...' భర్త నోట భార్య వినవలసివచ్చినమాట...

"నాకు మీ జీతమూ అక్కర్లేదు-మీ లెక్కలూ అక్కర్లేదు-ఇంట్లో ఏ వస్తువూ లేదు-తెస్తే వండుతాను. లేకపోతే లేదు."

"వండకు! మానెయ్యి!"

నిశ్చింతగా నిర్లిప్తంగా అన్నాడు.

గుండె ఝల్లుమంది.

పురాణాలూ-పెద్దమనుష్యులూ ప్రవచించే ఏ నీతిసూత్రాలు ఇలాంటి సమస్య పరిష్కరించి పెట్టలేవే! ఆ మరునాడు నిజంగానే వంట చెయ్యలేకపోయింది. పిల్లలు ఆకలని గోలపెడితే... కసిగా "పోయి మీ నాన్నను అడగండ"ని అనాలనుకొంది.

పెద్దవాడికి పద్నాలుగేళ్ళు-తరువాతి వాడికి పన్నెండు. ఆ తరువాత ఆడపిల్ల-ఎనిమిదేళ్ళు-ఆఖరివాడికి అయిదేళ్ళు.

ఆకలికి పేగులు అరుస్తున్నాయి-తనకే ఇలా ఉంటే ఆ పసివాళ్ళు మాట్లాడరేం?

పెద్దవాడిని తనే పలకరించింది.

"ఆకలిగా లేదూ?"

వాడు అప్పుడే పెద్దమనిషి అయిపోయాడు.

"ఎందుకుండదూ?"

"మరి..." ఎదిగీ ఎదగని ఆ కుర్రవాణ్ని ఇంకా ఏమని అడగాలో తెలియక ఆగిపోయింది.

''ఆకలి చాలా చికాగ్గాఉంటుంది-కానీ



మంచి నవల పుచ్చుకుంటే ఆకలి మరిచిపోవచ్చు-"

చేతిలో ఏదో చిన్నపిల్లల ఇంగ్లీష్ నవల చూపిస్తూ నవ్వాడు పెద్దవాడు.

రెండోవాడిని చూసింది...

వాడు పాతమేగజిన్లలో బొమ్మలు కత్తిరించటంలో లీనమయ్యాడు-సవతి తల్లి చూపులకు తలెత్తి ఆ కళ్ళలో ప్రశ్న అర్థంచేసుకుని సమాధానం చెప్పేసాడు. "హాయిగా ఆడుకొంటూంటే ఆకలి తెలీదు-కానీ ఇప్పుడు ఆడుకోవటానికి ఎవరుంటారూ! అందరూ బడికిపోతారు!"

ఆ నెల వాడి బడిజీతం కట్టలేదని గుర్తుకొచ్చి చటుక్కున తలవంచుకుంది.

"ఫరవాలేదు-ఈ బొమ్మలు కత్తిరించటం కూడా ఆటలాగే ఉంటుంది-" ఎదురు తానే సవతితల్లిని ఓదార్చాడు వాడు.

తనను అడగకుండానే ఆడపిల్ల అందుకుంది...

''ఇంట్లో వంటచెయ్యనప్పుడు మా అమ్మ ఏడుస్తోంటే నేను కళ్ళు తుడిచేదాన్ని-అప్పుడు నా ఆకలి మరిచిపోయేదాన్ని..."

నువ్వు ఏడుస్తావా? నన్ను ఏడవమంటావా? అన్నట్లుగా ఉన్నాయి ఆ పిల్ల మాటలు...

ఆఖరివాడు అదేపనిగా గ్లాసుతో బిందెలో నీళ్ళు ముంచుకొని తాగుతున్నాడు.

సవతితల్లిని చూసి నవ్వాడు.

ఇంక నిగ్రహించుకోలేక పోయింది-వాడిని దగ్గిరకు తీసుకుని ముద్దుపెట్టుకుని కిరాణాకొట్లో బిస్కట్లు అప్పుతెచ్చి వాడిచేతిలో పెట్టింది.

భర్త ఇంటికొచ్చి అన్నం పెట్టమని అడుగుతే నాలుగూ దులపాలని కాచుక్కూచుంది.

నోటినిండా తాంబూలంతో వచ్చాడు.

''అన్నం వండలేదు గదూ! మీ

పంతాలు నాకు తెలుసులే! అందుకే బయట తినేసే వచ్చాను!"

నవ్వుతూ అన్నాడు.

బొమ్మలా నిలబడిపోయింది - కన్న బిడ్డలగురించి కూడా పట్టించుకోని మానవుడు-మానవజాతికే మచ్చతెచ్చే ప్రాణి-సృష్టిలో ఇలాంటివాళ్ళుకూడా ఉంటారా?

అసలే చికాగ్గాఉన్న సుశీల ఆ రాత్రి భర్త చెయ్యిపట్టుకుని లాగేసరికి జుగుప్సతో వణికిపోయింది... "అన్నం బయట తినివచ్చారు-దీనికి మాత్రం ఇల్లు దేనికి? బయటికే పొండి..." అక్కసుగా అంది.

"పోవాలనిపించినప్పుడు పోతాను-రావాలనిపించినప్పుడు వస్తాను. నువ్వెవరివే అడగటానికి..." బలత్కారంగా మీదకు లాక్కున్నాడు - ప్రొద్దుటినుండి తిండిలేని సుశీల ఏ విధంగానూ ప్రతిఘటించలేకపోయింది...

కథల్లో, నవలల్లో ఎన్నెన్నో శృంగార వర్ణనలు చదివింది. యవ్వన సహజంగా మరెన్నో ఊహలల్లుకుంది...కానీ... ఇది ... ఛీ! ఛీ!

భర్త డబ్బు ఇవ్వలేదు! మొండివాడు...మనసన్నది లేనివాడు... ఏం చెయ్యాలి తను?

ఉన్న ఒక్క మంగళసూత్రాల గొలుసూ అమ్మేసింది...తన మెళ్లో ఏం ఉందో, ఏం లేదోకూడా గమనించలేని భర్తకు ఆ విషయం చెప్పదలచుకోలేదు-కాని ఆ డబ్బు ఎంతకాలం వస్తుంది? ఆ తరువాత? సరిగ్గా అలాంటి సమయంలో దేవతలాగ కనుపించింది కామాక్షమ్మ గారు.

ఒకప్పుడు సుశీల కామాక్షమ్మగారి దగ్గిర చదువుకుంది ... తెలివైన పిల్లల మీద టీచర్లకుండే సహజమైన మమకారంతో ఆదరంగా పలకరించింది సుశీలను.

ఏదో మాటలమీద "మా కొక గేమ్స్ టీచర్ కావాలి! ప్రైవేట్ స్కూల్ గనుక నూరు రూపాయలే ఇస్తారు — ఇంత చిన్న ఉద్యోగానికి కూడా లెక్కలేనన్ని అప్లికేషన్లు...చూడు నిరుద్యోగం ఎలా వుందో?" అంది.

సుశీల వెంటనే "దయచేసి నాకా ఉద్యోగం వచ్చేలా చూడరూ!" అని అడిగింది.

సుశీల కంఠంలో ఆర్తికి తెల్లబోయి చూసింది ఆవిడ—సుశీల సర్దుకుని "ఇంట్లో ఏంతోచక..." అంటూ నాన్చింది.

సమాజం! ...ప్రతిక్షణం అబద్ధాలాడుకోవలసిందే! అయితే అనుభవాలతో తలపండిన ఆవిడకు అర్థమయిపోయింది.

"సరే! ఆ ఉద్యోగం నీకే వచ్చేలా చూస్తాను!" అంది జాలిగా.

ఆ చిన్న ఉద్యోగానికే పొంగిపోయింది సుశీల.

నూరు రూపాయలతో నలుగురు పిల్లల్ని ఎలా పెంచగలనా అని దిగులు పడుతోన్న సుశీల తన పెట్టెలోంచి స్వతంత్రంగా డబ్బు తీసుకుంటోన్న భర్తను చూసి మండిపడింది.

"ఆ డబ్బు తియ్యకండి! అదే సరిపోదని ఆలోచిస్తున్నాను."

"ఏం? ఎందుకు తియ్యకూడదూ! నాకు కావాలి!"

"నా జీతం-నా యిష్టం—" అన్న మహానుభావుడు.

సుశీల అతని చేతిలోంచి డబ్బు లాక్కోవటానికి ప్రయత్నించింది.

"నెలంతా గడవాలి! పసివాళ్ళ తిండికికూడా లేకుండా అలమటిస్తోంటే చూడలేను!"

"హచ్చ! ప్రేమ! నాకులేని ప్రేమ నీ కొచ్చేసింది..."

వెటకారం!

భరించలేకపోయింది సుశీల.

"కేవలం పాశవిక చర్యవల్లనే ఎవరూ తలిదండ్రులు కాలేరు- అందుకే ఆ పిల్లలకు మీరు తండ్రికారు -కాలేరు- కనకపోయినా నేను తల్లిని... ఆ డబ్బు ఇలా ఇవ్వండి!"

"నోరు మూసుకో!"

ఒక్కతోపు తోశాడు - తినీ తినక బలహీనంగా ఉన్న సుశీల క్రింద కూలబడింది - దుఃఖం ఆపుకోలేకపోయింది.

"పిల్లలకోసం ఆ ఉద్యోగానికి వప్పుకున్నాను - అ డబ్బు కూడా ఖర్చు పెట్టెయ్యకండి!" ఏడుస్తూ అంది.

"ఏం వేషాలూ? నువ్వు ఉద్యోగం చేస్తున్నది పిల్లలకోసమా? లేకపోతే అక్కడ ఎర్రగా బుర్రగా ఉన్న మొగ మాస్టార్ల కోసమా?"

సుశీలకు పిచ్చెక్కినట్లయింది.

"నువ్వు... నువ్వు...రాక్షసుడివి... పిశాచానివి...దెయ్యానివి...నేను నేను.."

గట్టిగా ఉల్లాసంగా నవ్వాడు భర్త.

"ఏం చేస్తావ్? దానిలా చస్తానంటావా? అంతేనా! చావు! ఇంకో దాన్ని చేసుకుంటాను!"

డబ్బు జేబులో కూరుకుని వెళ్ళిపోయాడు.

రక్తం గడ్డకట్టినట్లయింది సుశీలకు. కొన్నిక్షణాలు కదలలేకపోయింది.

మొదటి భార్య ఆత్యహత్య చేసుకొందా? చచ్చిపోలేదా? తనుకూడా... ఎందుకు చావాలి. తన తప్పు ఏం లేకపోయినా ఒక మూర్ఖుడి అత్యాచారాలకు భయపడి ప్రాణాలు పోగొట్టుకోవాలా? ఎవరో ఏదో అంటారని తన బ్రతుకు బలిచేసుకోవాలా?

ఆ రోజే ఆ ఇంట్లోంచి బయటి కొచ్చేసింది సుశీల.

మోడుగా బ్రతకలేక రెండోపెళ్ళి వాడినయినా వరించిన సుశీల దహించివేసే ఈ జ్వాలలకన్న అలా మోడుగా ఉండటమే కొన్నిరెట్లు మేలనుకొంది!

అంతా అనుకొన్నట్లుగానే జరుగుతోంది. ఎటు తలతిప్పినా గుసగుసలు-వెకిలినవ్వులు - వెటకారాలు.

అయితే అనుకోనిది కూడా ఒకటి జరిగింది ... మొగుణ్నొదిలిన మగువ గురించి వింతగా విడ్డూరంగా చెప్పుకునే అమ్మాయిలూ, అమ్మలక్కలూ, పోకిరి కుర్రాళ్ళు, పెద్దమనుష్యులూ... అందరూ...కన్నతండ్రిని వదిలి ఆవిడ చుట్టూ చేరిన సవతి పిల్లల్ని చూసి నిజంగా ఆశ్చర్యపోయారు.